# కడుపు మంట

"బాబు"

రామన్నకు అవి చాలా కష్టదినాలు. నాల్గురోజుల్లో పదిహేనురోజులు జ్వరమువచ్చి పనికి వెళ్లలేక పోయేటప్పటికి ఆదాయము చాలా తక్కువ అయిపోయింది. ఏదో విధంగా కొంతకాలం తనూభార్యా యిద్దరు పిల్లలు కేవలము వస్తు అనిపించుకోకుండా రోజులు యీడ్చుకువచ్చారు. నాలుగురోజులనుంచి జీవితము దుర్భరము అయిపోయింది. రెండురోజులు అర్ధాకలితో గడిపారు. బొత్తిగా రెండు రోజులనుంచి రామన్న, వెంకమ్మ అన్నముతిని ఎరగరు. ఉన్నబియ్యము కాసినివండి పిల్లలిద్దరికీ పెట్టి రెండురోజులైంది. అంతటితో వారియింట్లో అన్నము కరువైంది.

కిందటిరాత్రి అంతా పిల్లలు "అన్నమే అమ్మా" "అన్నమే అమ్మా" అని అలమటించి నిద్రపోయినారు. తెల్లవారి నిద్రలేచిం·తరువాత వాళ్లను ఊరుకోపెట్టటము చాలా కష్టమైంది. ఎక్కడైనా గింజలో డబ్బో పుట్టించుకు రాకపోతే పిల్లల ఘోష చూడటము కష్టమని పిల్లలు నిద్రలేవకముందే రామన్న ఊరిమీదికి వెళ్లినాడు. వెన్నంటుకు పోయిన పొట్టతో, అతను ఎరిగిఉన్నవాళ్ల యిళ్లకు తిరిగాడు. ఒక్కమూరెడుకట్లుగాని పావలా రొఖ్ఖముగాని పుట్టలేదు. పదకొండుగంటలకు కాళ్లీడ్చుకొంటూ గంపెడు దిగులుతో యిల్లు చేరినాడు. వాకిట్లో భర్తరాక కోసరము ఎదురు చూస్తూన్న వెంకమ్మ భర్తవాలకం చూసి ఎక్కడా లక్ష్మి ప్రసన్నంకాలేదని తెలుసుకొని, కళ్లనిండా బొటబొటకారేనీళ్లు తుడుచుకొని పిల్లలను బ్రతికించుకోవడానికి అన్నను వెళ్లి ఆశ్రయించాలని నిశ్చయించుకొన్నది.

వెంకమ్మఅంటే ఏకోదరజనిత దోషాన అన్నకు ఆదరమున్నా, గయ్యాళిభార్య మూలాన ఆమెను పిల్లలను పిలచి ఏ రోజూ పట్టెడన్నము పెట్టిన పాపాన పోలేదు. అయినప్పటికీ ఆనాడుమాత్రము వెంకమ్మకు అన్నగారింటికి వెళ్లక తప్పిందికాదు. అన్నను అడిగి ఏమన్నా తెచ్చుకుని పిల్లల ఆకలిబాధ తీర్చుకోవచ్చుననే ఆశ ముందుకు నెడుతున్నా వదిన ఏమిచేస్తుందో నన్నభయము వెనక్కు లాగుతున్నవి. చివరకు మాతృత్వమే ముందుకునెట్టింది.

కుష్టుగా భోజనముచేసి అరుగుమీద చుట్టకాల్చుకుంటూ కూర్చునిఉన్న అన్న వెంకమ్మను చూడగానే నిర్విణ్ణుడైనాడు. పొంగివస్తున్న దుఃఖం ఆపుకోలేక కంటివెంట నీళ్లు రాలుస్తూన్న చెల్లెలకు ఏమో మునిగిందనుకొనే ఆదుర్దాతో:

"ఏమమ్మా అలాఉన్నావు. పిల్లలు మీ ఆయన ఖులాసాగా ఉన్నారా" అని అడిగాడు.

"యింకా బతికేఉన్నాము. పిల్లలు అన్నముతిని రెండు నాళ్లయింది. బావకు ఎక్కడా గింజలు పుట్టలేదు. పిల్లల ఘోష చూడలేక తల్లితోడుకదా అని నీ దగ్గరకు వచ్చాను......" అంతకుపైన ఏమీ మాట్లాడలేకపోయింది. తనమాట వినగానే వదిన ఇంట్లోనుంచి పులిలాగ వచ్చి ఎక్కడ మీదపడుతుందోనని బెదరుచూపులతో చూస్తూ గుంజనానుకొని, నుంచున్నది.

అన్నకు ఎక్కడలేని దుఃఖము వచ్చింది. కంటతడి పెట్టుకున్నాడు. తన అసహాయత్వానికి మిక్కిలి దుఃఖించాడు.

"అమ్మా, ఇంట్లో సంగతంతా నీకు తెలుసుగా. అన్నీ దానిజాగ్రత్తలో ఉంటవి. అన్నిటికీ తాళాలు. మంచికాలం కాబట్టి అది గడ్డికోసం పొలం వెళ్లిఉన్నప్పుడు వచ్చావు. నేను యిప్పుడు యివ్వగలిగినవి కొంచెం నూకలు కుండలో ఉన్నవి. అవి ఇస్తాను. అవి తీసుకువెళ్లి యీ పూట గడుపు. సాయంకాలము ఎక్కడున్నా నాలుగురూపాయిలు పట్టుకొచ్చి యిస్తాను" అని యింట్లోకి వెళ్లి కుండలో ఉన్న తవ్వెడునూకలు తెచ్చి వెంకమ్మ చెరుగులో పోశాడు.

"ఆ గయ్యాళి రాకపూర్వమే యింటికిపో అమ్మా." అని ఆదరణతో అన్నాడు. చెంగులోపడ్డ ఆ నూకలు చూచేటప్పటికి వెంకమ్మకు దుఃఖం కాస్త ఉపశమన మయింది. పిల్లలకు ఎప్పుడు వండి పెడుదామా అనే ఆత్రుతతో యింటి దోవ పట్టింది.

౨

గయ్యాళి మాచెమ్మ గడ్డికోసుకొని పొలంనుంచి తిరిగి

## అభాగ్యజీవి కథ

వస్తూంటే "ఏం. మాచెమ్మా యివాళ పెందలాడె గడ్డికి పోయినావు. ఆడబిడ్డ వస్తుందని తెలియదా ఏమి!" అంది పొరుగింటి మనిషి.

"ఏం ఆవిడగారు వచ్చిందా ఏమిటి? ఆవిడ ఎప్పుడూ యిక్కడకురాదే? పరాచకం ఆడుతున్నావు!"

"లేదమ్మా! ఇప్పుడే మీ యింట్లోనుంచి ఏవో చెంగులో పోసుకొని పోతుండగా చూసానోయి" ఆమె మాట పూర్తి కాకముందే యింటికి దోవతీసింది మాచెమ్మ.

ఇల్లుతలుపు తాళంవేసి భర్త ఎక్కడకో వెళ్లాడు. యింట్లోకి వెళ్లి ఏమి తరుగైందో కూడా చూచుకోవటానికి వీలులేదు. భర్తమీద, ఆడబిడ్డమీద వచ్చిన కోపము అణచుకోలేక పోయింది. గడ్డితట్ట వాకిట్లోవదిలేసి, యెకాయకీన ఆడబిడ్డయింటికి వెళ్లింది.

వాకిట్లో ఎవరూలేరు. లోపల పిల్లలిద్దరూ చెరోపక్కా కూర్చొని వేలితో కాలేకాలేవి తీసుకొని ఊదుకు నోటవేసుకుంటున్నారు. ఆ వండిన నూకలు తమ యింట్లోవే నని రూఢిచేసుకున్నది. వెంకమ్మకోసం చూస్తే ఎక్కడా కనపడలా. ఎక్కడకో వెళ్లినట్లుంది. నాలుగూ అందా మనుకుంటే అథము శుభము ఎరుగని పిల్లలు తప్ప ఎవరూ ఆవిడ దృష్టికి గోచరము కాలేదు. వేరేమార్గము తోచక ఆ వండిన నూకలను పక్కన మురికిగుంటలోపోసి, పిల్లలు యిద్దరూ గోలపెట్టి ఏడుస్తున్నా ఏమి ఖాతర్ చేయకుండా యింటికి వెళ్లిపోయింది.

వండుకున్న దాంట్లోకి ఆధరువుకోసం పక్కవీధిలోవున్న కొట్లో కారమునూరుకుని పిల్లలకు మొగుడికి ఎప్పుడు అన్నము పెడదామా అన్న ఆత్రతతో వెంకమ్మ యింటికి వచ్చింది. పిల్లలు గోలగా ఏడుస్తున్నారు. అన్నపుగిన్నె కనుపించలేదు. పెద్దపిల్లవాడి నడిగింది. "షరీ, నువ్వెళ్లగానే అత్తొచ్చి అన్నంతింటుంటే తీసుకొని ఆ గుంటలో పారేసి పోయింది." అని భోరున ఏడవటము ఆరంభించాడు.

ఆ మాటలు వినేటప్పటికి ఆమె కొయ్యబారిపోయింది. చేతిలో కారపుగిన్నె ఆమెకు తెలియకుండానే క్రిందజారి పడిపోయినది.

"ఛీ యీ దిక్కుమాలిన బ్రతుకు ఏం బ్రతక్కపోతే?" అని అంటూ చిన్నపిల్లను ఎత్తుకొని, పిల్లవాడి రెక్కపట్టుకొని, దొడ్డిప్రక్కనున్న పెద్దబావి వైపుకు పోయింది.

రామన్నవాకిట్లోకి వచ్చేటప్పటికి యిల్లు నిశ్శబ్దంగా ఉన్నది. పిల్లలుకాని భార్యగాని యింట్లోఉన్నట్లు కనుపించలేదు. అన్నము వండుకు తినబోతున్నవాళ్లు యిప్పుడు ఎక్కడకు వెళ్లాలా అనీ అనుకుంటుండగానే గభీమని బావిలో శబ్దము వినవచ్చింది.

గబగబా బావిదగ్గరకు పరిగెత్తాడు. చెదిరిననీళ్లు సర్దుకుంటున్నవి. లోపలనుంచి బుడగలు వస్తూన్నవి.

★


# SUNDAY MEDICINE

మూడు ఆదివారాలు వరుసగా మూడు మోతాదులు సేవించి ఏళ్లతరబడి వేధిస్తున్న బోదజ్వరమునుండి వందలాది ప్రజలు నివృత్తి పొందినారు. మా ఆదివారపుమందు ఫైలేరియా క్రిములను నాశనముచేయుటకు దివ్యౌషధము. ఎంతకాలం నుంచీ ఫైలేరియాతో బాధపడుచున్నప్పటికీ, మూడు మోతాదులు పుచ్చుకొంటే, మీరు తరచుగా జ్వరపడి జవసత్వాలను కోల్పోవలసిన పనివుండదు.

మా ఏంటి ఫైలేరియా మాత్రలు జ్వరం తిరిగిరాకుండా చెయ్యడమేగాక, శరీరానికి పటుత్వమిచ్చి, జ్వరం ఎన్నడూ సోకకుండా కాపాడుతవి.

*MANUFACTURERS:*

**M. C. N's ECLECTIC PHARMACY & DISPENSARY**

**49, SINGARACHARI STREET, TRIPLICANE, MADRAS.**